విస్తారంగా మొక్కజొన్న సాగు

తోట్లవల్లూరు మండలంలో 4,200 ఎకరాల్లో సాగు

మొక్కజొన్న సాగును తోట్లవల్లూరు మండలంలో రైతులు విస్తారంగా చేపట్టారు. గత ఏడాది కృష్ణానది వరదల కారణంగా లంకల్లో పంటలన్నీ దెబ్బతినటం, మినుముకు తెగుళ్ల బెడద, సాగు ఖర్చులు అధికమయ్యాయి. దీంతో ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగుపై రైతులు దృష్టి సారించారు. మార్కెట్‌లో మంచి ధర కూడా లభిస్తుండటంతో ప్రతి ఏటా మొక్కజొన్న సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది.



తోట్లవల్లూరులో సాగవుతున్న మొక్కజొన్న పైరు

తోట్లవల్లూరు: మండలంలో మొక్కజొన్న పంటను రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. రొయ్యూరు, వల్లూరుపాలెం, బొడ్డపాడు, చినపులిపాక, తోట్లవల్లూరు, పాములలంక, భద్రిరాజుపాలెం, చాగంటిపాడు, దేవరపల్లి, గురివిందపల్లి, ఐలూరు, తదితర గ్రామాలలోని లంక, మెట్ట, మాగాణి భూములలో మొక్కజొన్న అధిక విస్తీర్ణంలో సాగవుతోంది. వ్యవసాయశాఖ అంచనా ప్రకారం సుమారు 4,200 ఎకరాల్లో మొక్కజొన్నను రైతులు సాగు చేస్తున్నారు.

కృష్ణానది వరదలతో కకావికలం

గత ఏడాది సెప్టెంబర్‌లో కృష్ణానదికి వచ్చిన వరదతో రైతులు కకా వికలమయ్యారు. లంకల్లో సాగవుతున్న వేలాది ఎకరాల్లో పంటలన్నీ వరద ముంపునకు గురై దెబ్బతిన్నాయి. ప్రత్యామ్నాయ పంటల సాగులో భాగంగా రైతులు మొక్కజొన్న సాగును ప్రధానంగా చేపట్టారు. మొక్కజొన్న పంట కాలం తక్కువ కావటం, తెగుళ్ల బెడద లేకపోవటం, మంచి దిగుబడులు కూడా వస్తుండటంతో సాగు పట్ల ఆసక్తి కనబరుస్తున్నారు. వంద నుంచి 120 రోజుల్లో పంట చేతికి వస్తుండటంతో మొక్కజొన్న సాగు లాభదాయకంగా మారుతోంది.

పెరుగుతున్న డిమాండ్

మొక్కజొన్నకు మార్కెట్‌లో రోజురోజుకీ డిమాండ్ పెరుగుతోంది. చేపలు, రొయ్యలు, కోళ్ల పరిశ్రమల్లో మొక్కజొన్న ఫీడ్‌ను ఆహారంగా ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీంతో ఫీడ్ తయారీ కంపెనీలు మొక్కజొన్న కొనుగోళ్లను జోరుగా నిర్వహిస్తున్నాయి. ఎకరాకు సుమారు 40 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తుండగా, క్వింటాకు మార్కెట్‌లో రూ. 2 వేలకుపైగా మద్దతు ధర లభిస్తోంది. సాగు ఖర్చులు పోనూ ఎకరాకు రూ. 40 వేల వరకు మిగులుతుండటంతో రైతులు మొక్కజొన్న సాగును ఉత్సాహంగా చేపట్టారు.



మొక్కజొన్నకు మంచి ధర ఉంది

మొక్కజొన్న సాగు లాభదాయకంగా ఉంటోంది. తోడేళ్లదిబ్బలంకలో నేను 13 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నా. పంట కాలం తక్కువ కావటం, తెగుళ్ల బెడద ఉండకపోవటం, మార్కెట్‌లో మంచి ధర లభిస్తుండటంతో మొక్కజొన్నను ఎక్కువగా సాగు చేస్తున్నాను.

– గంగిశెట్టి సత్యనారాయణ, రైతు, తోడేళ్లదిబ్బలంక



రైతులకు ఆశించిన ధర లభిస్తోంది

మండల వ్యాప్తంగా మొక్కజొన్న పైరు విస్తారంగా సాగవుతోంది. మొక్కజొన్నకు మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగా ఉండటంతో కొనుగోళ్లు బాగా జరుగుతున్నాయి. రైతులకు ఆశించిన ధర కూడా లభిస్తుండటంతో సాగు విస్తీర్ణం క్రమంగా పెరుగుతోంది.

– జి. నాగేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి, తోట్లవల్లూరు

కొండలమ్మను దర్శించుకున్న జడ్జిలు



జడ్జి వెంకట వాహినికి చిత్రపటాన్ని అందజేస్తున్న పండితుడు శరశ్చంద్ర



జడ్జి వెంకటలక్ష్మికి అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న పండితుడు శరశ్చంద్ర

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని కైకలూరు సీనియర్ సివిల్ డివిజన్ జడ్జి వి.వీర నాగవెంకటలక్ష్మి, మచిలీపట్నం స్పెషల్ మొబైల్ జడ్జి ఎం.వెంకటవాహిని ఆదివారం దర్శించుకున్నారు. వారిని ఆలయ ఈఓ ఆకుల కొండలరావు సన్మానించారు. అమ్మవారి చిత్రపటాలతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు. తొలుత అమ్మవారికి వేద పండితుడు రుద్రపాక శరశ్చంద్ర సంతోష్ ప్రత్యేక పూజలను చేశారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



ఆటపాక గంగానమ్మ గుడిలో డీఎన్నార్ దంపతులు

కైకలూరు: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత అలవడుతుందని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పేర్కొన్నారు. ఆటపాక గంగానమ్మ దేవాలయ వార్షికోత్సవంలో సతీసమేతంగా పాల్గొని ఆదివారం పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కైకలూరు మండలాధ్యక్షుడు సింగంశెట్టి రాంబాబు, నాయకులు పంజా రామారావు, కన్నా రమేష్, బాబు, బాలు, తమ్మిశెట్టి కొండ, సిద్ధబత్తుల శ్రీరామమూర్తి, చొప్పాల రాము, రామిశెట్టి శ్రీదేవి, సింగంశెట్టి లక్ష్మీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

'అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలి'



ధర్నా చేస్తున్న వామపక్ష నాయకులు



గుడ్లవల్లేరులో ఆందోళన చేస్తున్న దళిత నాయకులు

గుడివాడ టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానిస్తూ ప్రసంగించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో నాయకులు ఆదివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ రాజ్యాంగాన్ని కించపరుస్తూ పార్లమెంట్‌లో హోం మంత్రి వ్యాఖ్యలు చేయడం దారుణం అన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని తూట్లు పొడిచే విధంగా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. ఏ రాజ్యాంగం ద్వారా అమిత్ షా హోం మంత్రి అయ్యారో మర్చిపోవడం సరికాదన్నారు. తక్షణమే హోం మంత్రి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు ఆర్‌సీపీ రెడ్డి, సీహెచ్ సత్యనారాయణ, కె. సురేష్, ఎల్. సురేంద్ర, ఆర్.కొండ, కె.లక్ష్మణరావు, అరుణ, యెషయ్య, నారాయణ, వెంకటేశ్వరరావు, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనవసర వ్యాఖ్యలు చేసిన అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పి, తన కేంద్ర హోం మంత్రి పదవికి రాజీనామా చేయాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక మండల నాయకుడు బి.వి.శ్రీనివాసరరావు డిమాండ్ చేశారు. ఆదివారం దళిత నాయకులు గుడ్లవల్లేరు, వడ్లమన్నాడులో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.

క్రికెట్ టోర్నమెంటు విజేత వేగ జట్టు



విజేత వేగ జట్టుకు మొదటి బహుమతి అందిస్తున్న ఏలూరు డీఎస్పీ

కైకలూరు: సంక్రాంతి పండుగ రోజుల్లో యువత జూదాలకు ఆకర్షితులు కాకుండా కైకలూరు టౌన్ పోలీసులు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రారంభించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ క్రీడాకారులను అభినందించి, బహుమతి ప్రదానం చేశారు. ప్రధానంగా టోర్నమెంట్ నిర్వహించిన టౌన్ సీఐ పి.కృష్ణ, ఎస్‌ఐలు డి.వెంకట్ కుమార్, ఆర్.శ్రీనివాస్ కృషిని మెచ్చుకున్నారు. క్రికెట్ విజేత వేగ జట్టుకు మొదటి బహుమతి రూ.25,000 (కలకొండ నాగేంద్రకుమార్), రెండో బహుమతి మండవల్లి జట్టుకు రూ.15,000 (బూరుబోయిన శ్రీనివాసరావు), మూడో బహుమతి డేంజర్ బాయ్స్‌కు రూ.10,000 (కాళ్లపాలెం నాగరాజు), నాల్గో బహుమతి రూ.5,000 వింజరం జూనియర్స్ జట్టుకు టోర్నమెంటు నిర్వహణ ఖర్చుల నుంచి అందించారు. మ్యాన్ ఆఫ్ ద సిరీస్, బెస్ట్ బ్యాట్స్‌మెన్ మండవల్లి జట్టులో క్రీడాకారుడు సాంబ, బెస్ట్ బౌలర్‌గా వీరమల్లు నాగరాజుకు సత్యం బుక్‌స్టాల్ గద్దం జితేంద్ర నగదు బహుమతులు అందజేశారు. మండవల్లి సాంబ టోర్నమెంట్ మొత్తంలో 156 రన్స్ సాధించి, 10 వికెట్లు తీశాడు. నాగరాజు టోర్నమెంట్ మొత్తం 16 వికెట్లు పడగొట్టాడు. ఫైనల్ మ్యాచ్‌లో కైకలూరు టౌన్ ఎస్‌ఐ డి.వెంకట్‌కుమార్ క్రీడాకారుడిగా పాల్గొన్నారు. కైకలూరు టౌన్, సర్కిల్ సీఐలు పి.కృష్ణ, వి.రవికుమార్, సర్కిల్ ఎస్‌ఐలు వెంకట్‌కుమార్, శ్రీను, రామచంద్రరావు, రాంబాబు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కబ్జా కోరల్లో ఇరిగేషన్ స్థలాలు



ఇరిగేషన్ స్థలంలో అక్రమంగా కట్టిన కట్టడం



లస్కర్‌కు కేటాయించిన క్వార్టర్స్

పామర్రు డ్రెయిన్ గట్టుపై ఉన్న స్థలాలు ఆక్రమణ

పామర్రు: పామర్రు డ్రెయిన్ భూ అక్రమార్కుల చేతులో పడి కుచించుకుపోయింది. మండలంలోని ఉరుటూరు గ్రామంలోని ఉరుటూరు వంతెన వద్ద ప్రారంభమైన డ్రెయిన్ వీరాంజనేయపురం కాలనీ, కోటిరెడ్డి పేట, చల్లపల్లి రోడ్డులో, అరండాల్ పేటలో ప్రవహించి ఆయా ప్రాంతాల మురుగును తీసుకొచ్చి నాగులేరు కాలువలో కలుపుతుంది. ఈ నేపథ్యంలో డ్రెయిన్ గట్టుపై ఉన్న ఇరిగేషన్ స్థలాలను, లస్కర్‌లకు కేటాయించిన క్వార్టర్స్‌ను అదే శాఖలో ఉన్న ఓ లస్కర్ తన ఆధీనంలోకి తీసుకుని వాటిని అయిన కాడికి అమ్మేశాడు. అది తెలియని అమాయకులు ఆ స్థలాలను కొనుగోలు చేసి అక్కడే నివాసాలను ఏర్పాటు చేసుకున్నారు. ఇదే ఇరిగేషన్ స్థలాలకు పంచాయతీ వారు ఇంటి పన్నులను సైతం ఏ విధంగా వేశారో అర్థంకావడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఆక్రమణలతో పామర్రు డ్రెయిన్ కుచించుకు పోయి మురుగు నీరు దిగువకు ప్రవహించని కారణంగా స్థానిక అరండాల్ పేట, పామర్రు–చల్లపల్లి రహదారిలో కొద్ది పాటి వర్షానికే రహదార్లు మురుగునీటితో నిండిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక కోటిరెడ్డి పేటలోని మురుగు కూడా దిగువకు పోయే మార్గం లేక ఎక్కడ మురుగు అక్కడే అన్న విధంగా ఉంటోంది. స్థానిక చల్లపల్లి రోడ్డులోని వర్షపు నీరు కూడా ఇదే కాలువలోకి చేరి నాగులేరులో కలవాల్సి ఉంది. అయితే చల్లపల్లి రోడ్డులో డ్రెయినేజీలను ఇష్టారాజ్యంగా పూడ్చివేయడంతో కొద్దిపాటి వర్షాలకే చల్లపల్లి రోడ్డు జలమయంగా మారుతోంది.

చోద్యం చూస్తున్న ఇరిగేషన్ అధికారులు

ఇరిగేషన్ శాఖ పరిధిలో ఓ లస్కర్ స్థలాలను ఆక్రమించుకుని విక్రయిస్తున్నా సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. సుమారు 0.20 ఎకరాల ఇరిగేషన్ స్థలం కబ్జాకు గురైంది. డ్రెయిన్ పరిధిలో ఆక్రమణలను వెంటనే తొలగించి, డ్రెయిన్‌లో పూడిక తీత పనులను చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

సమస్యను రెవెన్యూ అధికారులకు తెలియజేశాం

ఈ సమస్యలను స్థానిక రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అర్జీని సమర్పించాం. వారి ఆధ్వర్యంలోనే ఇరిగేషన్ స్థలాలకు సర్వేలు నిర్వహించాల్సి ఉంది. రెవెన్యూ అధికారులు ఎప్పుడు చెబితే అప్పుడు వారితోపాటు వచ్చి సర్వే నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– సాధిక్, ఇరిగేషన్, జేఈఈ పామర్రు

ఆత్మీయ సమ్మేళనం



మండవల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో 2013–2015వ సంవత్సర పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ బేతపూడి రవితేజ హాజరయ్యారు. ప్రిన్సిపాల్‌ను విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అప్పటి గురువులను సత్కరించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. అప్పటి అధ్యాపకులు ఎం.శ్రీనాథ్, ఎస్‌కే పాషా, పి.దాతేశ్వరరావు, కె.రాంబాబు, పూర్వ విద్యార్థి సంఘం ఆర్గనైజర్ సీహెచ్ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

మెగా ఉచిత వైద్యశిబిరం



సంఘంబడిలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యబృందం

గుడివాడ టౌన్: రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచితవైద్య శిబిరం నిర్వహించారు. పిన్నమనేని సిద్దార్థ మెడికల్ కళాశాల వైద్యబృందం ఆధ్వర్యంలో గుండె, నరాలు, ఎముకలు తదితర వ్యాధులకు సంబంధించి 55 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఇ. కార్తీక్, డాక్టర్ బి. నీలిమ, డాక్టర్ బి. విష్ణు, క్లబ్ కార్యదర్శి జి.కిరణ్‌బాబు, పూర్వ అధ్యక్షుడు రమణమూర్తి, శంకరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

■ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక పెద్దవీధిలోని సంఘంబడిలో నిర్వహించిన వైద్యశిబిరంలో 228 మందికి బీపీ, షుగర్, ఈసీజి తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 68 మందికి ఉచిత కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కె.రామారావు, కార్యదర్శి డి.శ్రీనివాస్, కోశాధికారి సీహెచ్. రామకృష్ణ, డాక్టర్ సందీప్, డాక్టర్ శివకోటేశ్, డాక్టర్ అజయ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



గుడివాడ టౌన్: తారక రామా వాకర్స్‌క్లబ్ నూతన కార్యవర్గం (2025) ప్రమాణ స్వీకారం స్థానిక జీవన్ పబ్లిక్ స్కూల్లో ఆదివారం జరిగింది. వాకర్స్ గవర్నర్ సనకా సుబ్బారావు నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా మెరుగుమాల బ్రహ్మయ్య, కార్యదర్శిగా బి.రాధాకృష్ణ, కోశాధికారి పి.నాంచారయ్య, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో జీవన్ పబ్లిక్ స్కూల్ వ్యవస్థాపకుడు కె. రామకృష్ణ, కార్యవర్గ సభ్యులు దండమూడి జయలక్ష్మి, అలీబేగ్, డి.శ్యామ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల్లో భాగంగా సోమవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఈఈ జీబీ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆర్టీసీ కాలనీ, పెద్దకాల్వ సెంటర్ తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు ప్రజా వేదిక

పామర్రు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు పామర్రు తహసీల్దార్ జీ రవి కాంత్ ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాతో పాటుగా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఇతర ముఖ్య అధికారులు, నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ ప్రజా వేదిక కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేసి, తగు విధమైన పరిష్కారం పొందాలని కోరారు.

ప్రత్యేక పూజలు



కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలో సావిత్రి గౌరీ నోములలో భాగంగా ఆదివారం ఉద్యాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. నోములు నోచుకుంటున్న మహిళల్లో ఒకరైన జంధ్యాల సుజాత నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని, పూజలను నిర్వహించేందుకు అధిక సంఖ్యలో భక్తుల తరలివచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాలలో స్థిరపడిన పలువురు కుటుంబ సభ్యులు తరలిరావడంతో శివాలయం ప్రాంతం సందడిగా మారింది. తొమ్మిది సువాసినిలకు ప్రత్యేక పూజలు చేసి వాయనాలను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని పురోహితులు జోశ్యుల కృష్ణ ప్రసాద్ శాస్త్రయుక్తంగా నిర్వహించారు.

బైండ్ల కులస్తులకు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలను ఇవ్వాలి

గుడ్లవల్లేరు: బైండ్ల కులస్తులకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలను అందించాలని హోం మంత్రి వంగలపూడి అనితను ఆ సంఘ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మందపాటి పాపారావు కోరినట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఆ సంఘ కృష్ణా జిల్లా అధ్యక్షుడు నిడుమోలు పెద్దిరాజు ఆదివారం విలేకరులకు తెలిపారు. బైండ్ల కులస్తులకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలను ఇచ్చేందుకు రాష్ట్రంలోని కొన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో విముఖత చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను పరిష్కరిస్తామని మంత్రి అనిత హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

జాతీయ ముదిరాజ్ మహాసభలో కోమటి



ముదినేపల్లి రూరల్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్ హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన జాతీయ ముదిరాజ్ మహాసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో ముఖ్య అతిథిగా గుజరాత్ రాష్ట్ర మంత్రి కన్వర్జీబాయ్ భవాలియా పాల్గొన్నట్లు విష్ణువర్ధన్ తెలిపారు. ఈ సందర్భంగా సంఘం అభివృద్ధికి తీసుకోవాల్సిన పలు నిర్ణయాలను సమావేశంలో చర్చించినట్లు పేర్కొన్నారు.

కొండలమ్మ సన్నిధిలో భక్తుల సందడి



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తుల తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ ఈఓ ఆకుల కొండలరావు తగు ఏర్పాట్లు చేశారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు


ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. సదూర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని పుట్టలో పాలు పోసి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి పర్యవేక్షణలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.

రెండు పూరిళ్లు దగ్ధం



గుడ్లవల్లేరు: వడ్లమన్నాడులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జంగం శ్రీనివాసరరావు, జంగం ముసలయ్యకు చెందిన రెండు పూరిళ్లు ఆదివారం దగ్ధమయ్యాయి. రూ.3లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. బాధితులు ఇళ్లలో లేని సమయంలో ఈ ప్రమాదం ఏర్పడేసరికి ఎవరికీ ప్రమాదం జరగలేదు. సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలు రోడ్డు మీదకు వచ్చాయి. అదేవిధంగా ఆ పక్కనే ఉన్న నత్తా సుబ్బారావుకు చెందిన మైకులు, బ్యాటరీలు అగ్నికి ఆహుతయ్యాయి.

గడ్డివామి దగ్ధం



కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడి పక్షులబీడులో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డివామి దగ్ధమైంది. బాధితుడు వెన్నం శివ అర్జునరావుకు అగ్ని ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. ఈ ప్రమాదంలో రెండు ఎకరాల గడ్డివామి దగ్ధమైంది. సమాచారం అందుకున్న ఫైర్ ఆఫీసర్ కొణతం వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో సిబ్బంది మంటలను అదుపు చేశారు.

నేటి నుంచి పశువైద్య శిబిరాలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెదగొన్నూరు, ప్రొద్దువాక వెటర్నరీ డిస్పెన్సరీ పరిధిలోని గ్రామాల్లో సోమవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ప్రొద్దువాక డిస్పెన్సరీ పశు వైద్యుడు ఆరేపల్లి రామకృష్ణ తెలిపారు. ఈ శిబిరాల్లో నట్టల నివారణ మందులు, చూడు పరీక్షలు, కృత్రిమ గర్భధారణ వంటి చికిత్సలు అందిస్తామని పేర్కొన్నారు.